సాక్షి
నిజామాబాద్
గురువారం । 24 । ఆగస్టు । 2023



రోగులకు సేవలందించాలి
పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు ఇబ్బందులు కల్గకుండా సేవలందించాలని డీఎంహెచ్‌వో సుదర్శనం ఆదేశించారు.
- 10లో ▸



సమస్యల పరిష్కారానికి కృషి
బోధన్‌లోని రాకాసిపేట్ రైల్వే స్టేషన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డీఆర్ఎం లోకేష్ వైష్ణోయ్ అన్నారు.
- 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 32.1 /23.7
ఉదయం చల్లగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

జిల్లా రిజిస్ట్రార్‌గా ప్రసూన

ఖలీల్‌వాడి: స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలు జరిగాయి. జిల్లా రిజిస్ట్రార్‌గా ప్రసూన నియమితులయ్యారు. ఇన్నిరోజులు ఆదిలాబాద్‌కు చెందిన ఫణీందర్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఆయన స్థానంలో ప్రసూన బదిలీపై వచ్చారు. డీఐజీ మధుసూదన్‌రెడ్డి స్థానంలో రమేష్‌రెడ్డి బదిలీపై వచ్చారు. సబ్‌రిజిస్ట్రార్‌గా రాంచంద్రయ్య నియమితులయ్యారు.

ట్రిపుల్ ఐటీకి బస్సు సర్వీస్ ప్రారంభం




ఖలీల్‌వాడి: నిజామాబాద్ బస్టాండ్ నుంచి బాసర ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు బస్సును ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా బుధవారం ప్రారంభించారు. ఆర్టీసీ చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులకు సౌకర్యంగా ఉండేందుకు క్యాంపస్‌కు బస్సు సర్వీస్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మేయర్ దండు నీతూకిరణ్, ఆర్టీసీ ఆర్ఎం జానీరెడ్డి, జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, డిపో మేనేజర్లు ఆనంద్, నల్ల సాయన్న తదితరులు పాల్గొన్నారు.

నగరంలో అభివృద్ధి పనులు..



నిజామాబాద్‌నాగారం: నగరంలోని పలు డివిజన్లలో ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా బుధవారం అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో ఇందిరాపూర్ నుంచి భారతిరాణి కాలనీ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే బిగాలకు మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. నగరంలోని ఇందిర ప్రియదర్శిని కాలనీలో రూ.16 లక్షలతో నిర్మించిన పార్క్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. సీతారాం కాలనీ, ఇందిరాపూర్ కాలనీ, గోశాల రోడ్డు, భారతి రాణి కాలనీలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులకు భూమి పూజ చేశారు. 13వ డివిజన్‌లో శ్మశాన వాటిక పనులను ప్రారంభించారు. మేయర్ దండు నీతూకిరణ్, అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, మున్సిపల్ కమిషనర్ మకరంద్, డిప్యూటీ మేయర్ ఇద్రిస్‌ఖాన్, కార్పొరేటర్లు ఇందిర వినోద్, విక్రమ్ గౌడ్, సాధు సాయివర్ధన్, బొడిగం కోమల్, హారూన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నుడా అభివృద్ధికి పాటుపడుతా



నిజామాబాద్‌నాగారం: నుడా పరిధిలోని అధికారులు, ప్రజాప్రతినిధులను కలుపుకొని సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధికి పాటు పడుతానని నుడా చైర్మన్ ఈగ సంజీవరెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని నుడా కార్యాలయంలో ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, మేయర్ నీతూకిరణ్ సమక్షంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనకు పదవి రావడానికి కృషి చేసిన ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌కు, పదవి ఇచ్చిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు బోర్గాం నుంచి పెద్ద ఎత్తున ర్యాలీగా వచ్చారు. సంజీవరెడ్డికి ప్రజాప్రతినిధులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

గురుకుల విద్యార్థినికి సీపీగెట్‌లో 29వ ర్యాంకు



నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్ నగరంలోని కంఠేశ్వర్ బ్యాంకు కాలనీకి చెందిన విద్యార్థిని సుంకర శివాని సీపీగెట్ 2023 మైక్రో బయాలజీలో 29వ ర్యాంకు సాధించింది. శివాని ఆర్మూర్‌లోని తెలంగాణ సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతోంది. విద్యార్థిని ప్రతిభకు కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు అభినందించారు. సీపీ గెట్‌తో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో ప్రవేశాలు ఉంటాయి.

జయహో భారత్!

చంద్రయాన్-3 విజయంతో జిల్లావ్యాప్తంగా సంబురాలు





ప్రపంచమంతా ఉత్కంఠతో ఎదురుచూసిన చంద్రయాన్-3 విజయవంతం కావడంతో జిల్లావ్యాప్తంగా ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి భారతీయుడు గర్వించే ఈ క్షణం అపూర్వమని వివిధ వర్గాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చందమామ దక్షిణ ధ్రువంపై అడుగిడిన తొలిదేశంగా భారత్ నిలవడం ప్రతిఒక్క భారతీయుడికి గర్వకారణంగా నిలిచిందని అంటున్నారు. విక్రమ్ ల్యాండర్ బుధవారం సాయంత్రం సజావుగా చంద్రుడి దక్షిణ ధ్రువంపై కాలుమోపి, భారత కీర్తి పతాకాన్ని రెపరెపలాడించింది. ల్యాండర్ చందమామపై దిగే సమయంలో ప్రజలంతా టీవీలకు, ఫోన్లకు అతుక్కుపోయారు. ఈ అపురూప క్షణాన్ని చూసేందుకు ప్రత్యేక స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు విజయవంతం అయ్యాక పటాకులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. – సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

శాస్త్రవేత్తలకు సలాం



ఇస్రో శాస్త్రవేత్తలకు సలాం. వారు ఎంతో కష్టపడి దేశానికి ప్రపంచంలోనే గుర్తింపు తీసుకు వచ్చారు. దక్షిణ ధ్రువంలో మొదటిసారిగా కాలుమోపిన దేశంగా నిలిపారు. వారికి దేశ ప్రజలు రుణపడి ఉంటారు. – బి దీక్షిత 9వ తరగతి, కాకతీయ ఒలింపియడ్ పాఠశాల

విద్యార్థుల్లో అవగాహన పెరుగుతోంది



చంద్రయాన్-3 సాధించిన ఈ విజయం అద్భుతం. ఇలాంటి ప్రయోగాలతో విద్యార్థుల్లో కూడా అంతరిక్షంపై అవగాహన పెరుగుతోంది. ప్రస్తుతం ఈ విజయంతో దేశ ప్రజలు శాస్త్రీయ స్ఫూర్తిని నింపుకోవడం సంతోషం. అంతరిక్ష రంగంలో అవగాహన కోసం జిల్లాలో ప్లానిటోరియం మ్యూజియం ఏర్పాటు చేసుకోవాలి. – గంగాకిషన్, జిల్లా సైన్స్ అధికారి



నగరంలో ఎన్టీఆర్ చౌక్‌లో పటాకులు కాలుస్తున్న బీజేపీ నాయకులు..



చంద్రయాన్ -3 విజయవంతం కావడంతో న్యూ అంబేడ్కర్ భవన్‌లో యువకుల హర్షాతిరేకాలు

భారత్ కీర్తి మరింతగా..



చంద్రయాన్-3 విజయంతో భారతదేశం కీర్తి ప్రతిష్టలు మరింతగా ఇనుమడించాయి. భారతీయ శాస్త్రవేత్తల మేధస్సు, పరిజ్ఞానం చాలా గొప్పవి. మేధస్సు విషయంలో భారతీయులు ఎంత ముందుంటారనే విషయానికి ఇది మరో తార్కాణం. – వేముల ప్రశాంత్‌రెడ్డి, మంత్రి

140 కోట్ల భారతీయుల కల నిజమైంది



చంద్రయాన్-3 విజయంతో 140 కోట్ల భారతీయుల కల నిజమైంది. పదిహేనేళ్ల క్రితం చంద్రుడిపై నీరుందని తేల్చి విశ్వ పరిశోధనల్లో కొత్త శ్వాస నింపిన భారత్, తాజాగా జాబిల్లిపైకి ఏ దేశం వెళ్లని దారుల్లో వెళ్లి, ఎవరూ చూడని దక్షిణ ధ్రువ జాడల్ని ప్రపంచానికి చూపించింది. ఇస్రో బృందానికి అభినందనలు. – ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

శాస్త్రవేత్తల కృషి అభినందనీయం



భారత శాస్త్రవేత్తలు తమ గొప్పతనాన్ని మరోసారి చాటుకున్నారు. తాజా విజయంతో ప్రపంచంలో అంతరిక్ష ప్రయోగాల్లో భారత్ అగ్రస్థానంలోకి వచ్చింది. ఇంతటి తిరుగులేని విజయాన్ని సాధించిన భారత శాస్త్రవేత్తల కృషి అభినందనీయం. – మానాల మోహన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు



చంద్రయాన్-3 విజయవంతం కావాలని పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

విశ్వగురువుగా భారత్



భారతదేశం విశ్వగురువుగా నిలిచే దూరం అతి సమీపంలోనే ఉంది. చంద్రుడి దక్షిణ ధ్రువంపైకి అడుగుపెట్టిన మొట్టమొదటి దేశంగా భారత్ నిలవడం ప్రతి ఒక్క భారతీయుడికి గర్వకారణం. అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో చంద్రయాన్‌కు బీజం వేశారు. ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇస్రోకు మరింత దన్నుగా నిలిచి ప్రోత్సహించారు. దీంతో తాజా విజయం భారత్ ఖాతాలోకి వచ్చింది. దీంతో ప్రతి భారతీయుడు ప్రపంచ వయనికపై సగర్వంగా రొమ్ము విరుచుకుని నిలబడేలా చేసింది. భారతీయ శాస్త్రవేత్తల మేధస్సుకు అభినందనలు. – ధర్మపురి అర్వింద్, నిజామాబాద్ ఎంపీ



నగరంలో యోగాసనాలతో మహిళల విన్యాసం – సాక్షి ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

పక్కాగా ఓటర్ల తుది జాబితా

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పక్కాగా ఓటర్ల తుది జాబితా రూపొందేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. ఇందుకు రాజకీయ పార్టీలు కూడా తమవంతు సహకారం అందించాలని కోరారు. ఓటర్ల డ్రాఫ్ట్ రోల్ వెలువరించిన నేపథ్యంలో బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో, ఆయా మండలాల తహసీల్దార్లతో కలెక్టర్ వేర్వేరుగా సమావేశమై కీలక సూచనలు చేశారు. ఓటరు డ్రాఫ్ట్ రోల్‌కు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 21 నుంచి సెప్టెంబర్ 19 వరకు స్వీకరిస్తామన్నారు. అక్టోబర్ 4న తుది జాబితా ప్రకటిస్తామని తెలిపారు. కొత్తగా ఓటరు జాబితాలో పేర్ల నమోదు, మార్పులు-చేర్పులకు ఇంకా అవకాశం ఉన్నందున అర్హులైన వారు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఓటరు నమోదు, సవరణల కోసం ఈ నెల 26, 27 తేదీల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తప్పులకు అవకాశం లేకుండా ఎవరికివారు తమ దరఖాస్తులను పూరించి అందజేయాలని సూచించారు. జిల్లాలో 1,509 పోలింగ్ కేంద్రాలు ఉండగా, కొత్తగా మరో 40 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. నూతన బీఎల్‌వోల వివరాలను రాజకీయ పార్టీలకు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. జాబితా నుంచి పేరు తొలగించే ముందు క్షుణ్ణంగా పరిశీలన చేయాలని, సహేతుకమైన కారణాలు ఉంటేనే తొలగించాలని కలెక్టర్ సూచించారు. ఈ నెల 26లోపు తమ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించి, విద్యుత్, తాగునీరు, ర్యాంప్‌లు, టాయిలెట్స్ వంటి వసతులు అందుబాటులో ఉన్నాయా లేవా అన్నది పరిశీలించి నివేదిక సమర్పించాలని తహసీల్దార్లను ఆదేశించారు. సెక్టోరల్ అధికారులతో కలిసి రూట్ మ్యాప్‌లను పరిశీలించాలని, నిర్దిష్టమైన నిబంధనలను అనుసరిస్తూ సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

కాంగిరేస్‌కు దరఖాస్తులు

- గాంధీభవన్‌కు వరుస కడుతున్న ఆశావహులు
- కాంగ్రెస్ పార్టీలో చేరనున్న వారూ ఏర్పాట్లలో నిమగ్నం
- బీసీ కోటాకు పెరుగుతున్న డిమాండ్

వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వం ఆశిస్తున్న పార్టీ శ్రేణులు టిక్కెట్ల కోసం గాంధీ భవన్‌కు వరుస కడుతున్నారు. ప్రతి పార్లమెంట్ స్థానం పరిధిలో రెండు నుంచి మూడు సీట్లు బీసీలకు కేటాయించాలన్న డిమాండ్ నేపథ్యంలో ఈ కోటాలో సీట్ల కోసం ఆశావహులు ముందుకు వస్తున్నారు.



నిజామాబాద్ రూరల్ కోసం దరఖాస్తు చేస్తున్న బాడ్సి శేఖర్‌గౌడ్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : కాంగ్రెస్ పార్టీ నుంచి అభ్యర్థిత్వం ఆశించేవారు దరఖాస్తులు చేసుకోవాలని పార్టీ నాయకత్వం నిబంధన పెట్టడంతో ఆశావహులు స్పీడ్ పెంచారు. ఇందులో భాగంగా ఆగమేఘాల మీద దరఖాస్తు ఫీజు డీడీలు తీసుకుని మరీ ముహూర్తం చూసుకుని గాంధీభవన్‌కు వెళ్లి సమర్పిస్తున్నారు. కొందరు ఆశావహులు నేరుగా వెళ్లి అందజేస్తున్నారు. మరికొందరు మాత్రం తమ అనుచరుల ద్వారా దరఖాస్తులను గాంధీభవన్‌కు పంపిస్తున్నారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుంచి టిక్కెట్టు ఆశిస్తూ ఇప్పటివరకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్, నగర పార్టీ అధ్యక్షుడు కేశ వేణు, నరాల కల్యాణ్ దరఖాస్తులు సమర్పించారు.

✤ నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం కోసం రేకులపల్లి భూపతిరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేష్‌రెడ్డి, బాడ్సి శేఖర్‌గౌడ్, అరికెల నర్సారెడ్డి దరఖాస్తులు చేసుకున్నారు.

✤ బోధన్ నియోజకవర్గం టిక్కెట్టును ఆశిస్తున్న కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి తన దరఖాస్తును సమర్పించారు. గురువారం మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి తన దరఖాస్తును ఇవ్వనున్నారు.

✤ బాల్కొండ నియోజకవర్గం నుంచి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్‌రెడ్డి తన దరఖాస్తును అనుచరుల ద్వారా గాంధీ భవన్‌కు పంపించారు. మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్‌కుమార్ శుక్రవారం దరఖాస్తు చేయనున్నారు.



నిజామాబాద్ అర్బన్ కోసం తాహెర్‌బిన్.

✤ ఆర్మూర్ నియోజకవర్గం టిక్కెట్టు కోసం మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మార చంద్రమోహన్ దరఖాస్తు చేసుకున్నారు. ఇక జిల్లా సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు గోర్తె రాజేందర్, పీసీసీ అధికార ప్రతినిధి ఏబీ శ్రీనివాస్, కోలా వెంకటేష్, పూనింటి మహిపాల్‌రెడ్డి గురు, శుక్రవారాల్లో దరఖాస్తులు చేయనున్నారు. ఇక త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్న ప్రొద్దుటూరి వినయ్‌రెడ్డి సైతం దరఖాస్తు చేయనున్నారు.

బీసీ కోటా నేపథ్యంలో..

కాంగ్రెస్ పార్టీ నుంచి రాష్ట్రంలో ప్రతి పార్లమెంట్ స్థానం పరిధిలో రెండు నుంచి మూడు వరకు సీట్లను బీసీలకు కేటాయించాలని డిమాండ్లు ఉన్నాయి. అధిష్టానం సైతం ఈ దిశగా పరిశీలన చేస్తోంది. ఈ నేపథ్యంలో బీసీ కోటాలో సీట్ల కోసం ఆశావహులు ముందుకు వస్తున్నారు. ఈ క్రమంలోనే ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్ నుంచి బీసీ కోటా కింద దరఖాస్తులు వస్తున్నాయి. నిజామాబాద్ రూరల్ నుంచి సైతం బీసీ కోటా కింద టిక్కెట్టు ఇవ్వాలంటూ బాడ్సికి చెందిన మోతుకూరి శేఖర్‌గౌడ్ దరఖాస్తు చేసుకున్నారు. అధికార పార్టీ అభ్యర్థులను ప్రకటించినప్పటికీ కాంగ్రెస్, బీజేపీ మాత్రం టిక్కెట్ల కేటాయింపులో ఆచితూచి వ్యవహరిస్తుండటం గమనార్హం.

సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటా

- ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి: సీఎం కేసీఆర్ తనపై నమ్మకంతో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా మూడో సారి ఎంపిక చేశారని ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటానని ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత బుధవారం తొలిసారి ఆయన రూరల్ నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ వాహన ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. ఇందల్వాయి నుంచి భారీ వాహన శ్రేణితో బయలుదేరిన బాజిరెడ్డి గోవర్ధన్‌కు డిచ్‌పల్లి మండలం కేంద్రంలో పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఎమ్మెల్యే నివాళులర్పించారు. అనంతరం డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ వద్ద ప్రజలనుద్దేశించి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ భారీ మెజార్టీతో గెలుపొంది కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయమన్నారు. తాను రూరల్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి పనులే గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. డిచ్‌పల్లిలో తెలంగాణ యూనివర్సిటీ ఏర్పాటు, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మంజూరు, బోర్గాం నుంచి నడిపల్లి వరకు సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేశామన్నారు. త్వరలో నడిపల్లి నుంచి నాగ్‌పూర్ గేట్ వరకు సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభిస్తామన్నారు. నుడా చైర్మన్ ఈగ సంజీవ్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సాంబరి మోహన్, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్‌మోహన్, డిచ్‌పల్లి జెడ్పీ టీసీ దాసరి ఇందిర లక్ష్మీనర్సయ్య, ఎంపీపీలు రమేశ్‌నాయక్, కుంచాల విమల రాజు, నల్ల సారిక హన్మంత్‌రెడ్డి, సంగీత రాజేందర్, అనూష, చింత శ్రీ నివాస్ రెడ్డి, జీనియస్ నారాయణరెడ్డి, గజవాడ జైపాల్, శక్కరికొండ కృష్ణ, నర్సయ్య పాల్గొన్నారు.





ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌కు స్వాగతం పలుకుతూ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

క్లుప్తంగా

రైతు బ్యాంకు ఖాతా వివరాలు సేకరణ



సాక్షి ఎఫెక్ట్‌..

కమ్మర్‌పల్లి: రుణమాఫీకి నోచుకోని రైతు పేరిట సాక్షి జిల్లా టాబ్లాయిడ్‌లో ప్రచురితమైన కథనానికి అధికారులు బుధవారం స్పందించారు. వ్యవసాయ శాఖ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్లస్టర్‌ వ్యవసాయాధికారులు బాధిత రైతు పెంట భాజన్నను కలిసి వివరాలు సేకరించారు. బాధితుడితో కలిసి కమ్మర్‌పల్లిలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో రుణమాఫీ రాకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మేనేజర్‌ నుంచి వివరాలు సేకరించారు. నివేదికను భీమ్‌గల్‌ ఏడీఏ మల్లయ్య ద్వారా జిల్లా వ్యవసాయ శాఖకు నివేదిస్తామని క్లస్టర్‌ అధికారులు తెలిపారు.

అక్టోబర్‌ 3 నుంచి ప్రీ పీహెచ్‌డీ రెగ్యులర్‌ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): టీయూ పరిధిలోని పరిశోధక విద్యార్థులకు అక్టోబర్‌ 3 నుంచి ప్రీ పీహెచ్‌డీ రెగ్యులర్‌ / బ్యాక్‌లాగ్‌ పరీక్షలు నిర్వహించనున్నట్లు కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ అరుణ బుధవారం తెలిపారు. 2022–2023 రెగ్యులర్‌ స్కాలర్స్‌తో పాటు 2013–14 బ్యాక్‌లాగ్‌ పరిశోధక విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. ఆర్ట్స్‌, సోషల్‌ సైన్స్‌, ఎల్‌ఎల్‌బీ, కామర్స్‌, బిజినెస్‌ మేనేజ్‌మెంట్‌, సైన్స్‌ కోర్సులకు సంబంధించిన విద్యార్థులు సెప్టెంబర్‌ 16లోగా ఫీజు చెల్లించాలన్నారు. రూ.500 అపరాధ రుసుముతో సెప్టెంబర్‌ 21వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉందన్నారు. మొదటి పేపర్‌ అక్టోబర్‌ 3న, రెండో పేపర్‌ పరీక్షలు 4న నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు టీయూ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ



తెయూ(డిచ్‌పల్లి): టీయూ పరిధిలో కొనసాగుతున్న బీఈడీ, పీజీ సెమిస్టర్‌ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ అరుణ తెలిపారు. క్యాంపస్‌లోని ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాలలో పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఉదయం నిర్వహించిన బీఈడీ మొదటి సంవత్సరం పరీక్షలకు 141 మంది విద్యార్థులకు గాను 127 మంది హాజరు కాగా 14 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. పీజీ రెండో సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌ పరీక్షకు 1939 మంది విద్యార్థులకు గాను 1782 మంది హాజరు కాగా 157 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. ఆమె వెంట ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ సీహెచ్‌ ఆరతి ఉన్నారు.

నీలకంఠేశ్వర ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



నిజామాబాద్‌ సిటీ: నగరంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయ లెక్కింపును బుధవారం నిర్వహించినట్లు దేవాదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్‌ సుప్రియ తెలిపారు. ఐదు నెలలుగా హుండీల ద్వారా రూ. 4లక్షల10వేల783 ఆదాయం వచ్చిందన్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌ బిల్లా మహేశ్‌, ఈవో వేణు, అర్చకులు సుహాస్‌, మకరం, చంద్రశేఖర్‌శర్మ, సిబ్బంది అమ్మరావు, సాయికిరణ్‌, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

ఇస్రో సరికొత్త రికార్డు

- చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగిన ల్యాండర్‌ విక్రమ్‌
- హర్షం వ్యక్తం చేసిన జిల్లా ప్రజలు

నిజామాబాద్‌అర్బన్‌: అంతరిక్ష చరిత్రలో ఇస్రో సరికొత్త చరిత్ర సృష్టించింది. చంద్రయాన్‌–3 ప్రయోగం విజయవంతం కావడంతో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే తొలిసారిగా చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండర్‌ విక్రమ్‌ దిగుతున్న క్షణాన వీడియో వీక్షిస్తున్న ప్రజలు ఉద్విగ్న క్షణాల మధ్య జయహో భారత్‌, జై భారత్‌ అంటూ నినాదాలు చేశారు. పలు చోట్ల మువ్వన్నెల జెండాను అభిమానులు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. పలువురు తమ అభిప్రాయాలను 'సాక్షి'తో పంచుకున్నారు.



వీఎన్‌ఆర్‌ స్కూల్‌లో జై భారత్‌ అంటూ నినాదాలు చేస్తున్న విద్యార్థులు

సత్తా చాటిన భారత్‌



చంద్రయాన్‌–3 ప్రయోగంలో భారతదేశం సత్తా చాటింది. మన శాస్త్రవేత్తల కృషి ఎంతో ఉంది. ప్రపంచంలోనే తొలిసారిగా చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండర్‌ దిగడం ఆనందంగా ఉంది. ప్రపంచ దేశాలు భారత్‌వైపు చూస్తున్నాయి.

– భానుక చంద్రశేఖర్‌, రిటైర్డ్‌ ఆర్మీ, మామిడిపల్లి

భారత్‌ది అద్భుతమైన సాహసం



ప్రపంచ దేశాలే ఔరా అనిపించేలా భారతదేశం సాధించిన చంద్రయాన్‌–3 ఘనవిజయం ఎంతో మధురమైనది. తొలిసారిగా చంద్రుడి దక్షిణ ధ్రువంపై భారతదేశం తరఫున ల్యాండర్‌ విక్రమ్‌ను దించడం ఆనందదాయకం. ఇస్రో శాస్త్రావేత్తల కృషి ఎంతో ఉంది. ఈ ఘనతతో ప్రపంచ దేశాలు భారతదేశం వైపు తొంగి చూస్తున్నాయి. ప్రపంచంలో ఏ దేశం సాధించని విజయాలు ఇస్రో సాధిస్తోంది. –దాదన్నగారి మధుసూదన్‌రావు, బీఆర్‌ఎస్‌ లీగల్‌సెల్‌ కన్వీనర్‌

యావత్‌ దేశం ఆనందోత్సాహాల్లో..



చంద్రయాన్‌–3 ప్రయోగం విజయవంతం కావడంతో దేశవ్యాప్తంగా సంబురాలు మిన్నంటాయి. ప్రయోగానికి కృషి చేసిన శాస్త్రవేత్తలతో పాటు ఇందుకు యావత్‌దేశం ఆనందోత్సాహాల్లో మునిగిపోయింది. భారత్‌ చేపట్టిన ఈ ప్రయోగాన్ని నాసా కూడా ఎంతో ఆతృతగా ఎదురు చూసింది. భారతదేశంలో పుట్టినందుకు గర్వంగా ఉంది.

– వంష్‌ కీర్తన్‌గౌడ్‌, 7వతరగతి విద్యార్థి

ప్రపంచంలో మనమే నంబర్‌ వన్‌



ఇస్రో సాధిస్తున్న విజయాలతో ప్రపంచంలో మనమే నంబర్‌ వన్‌ స్థానంలో ఉన్నాం. ఇంతటి విజయానికి శాస్త్రవేత్తల కృషి ఎంతో ఉంది. భారతదేశం శాస్త్ర సాంకేతిక రంగంలో మరింత అభివృద్ధి చెందుతోంది. భారత్‌ మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నా..

– మన్యశ్రీ, 9వ తరగతి విద్యార్థిని

శాస్త్రవేత్తల కృషి అభినందనీయం



చంద్రయాన్‌–3 ప్రయోగంలో ఇస్రో శాస్త్రవేత్తల కృషి అభినందనీయం. భారతదేశం ఇంతకుముందు చేసిన ప్రయోగం విఫలమైనా చంద్రయాన్‌–3 విజయవంతమైంది. ప్రపంచ దేశాలు భారత్‌వైపు చేసేలా కృషి చేసిన ఇస్రో శాస్త్రవేత్తల బృందానికి అభినందనలు.

– బి. లక్ష్మణ్‌, ప్రభుత్వ టీచర్‌

భారతదేశం ఎంతో గొప్పది



ప్రపంచంలో ఏ దేశం సాధించలేని గొప్ప విజయాన్ని భారతదేశం సాధించింది. ఇప్పటి వరకు చంద్రుని దక్షిణ ధ్రువంపై ఏ దేశం అడుగు పెట్టలేదు. భారతదేశం విజయవంతంగా ల్యాండర్‌ విక్రమ్‌ను లాంచ్‌ చేయడం అభినందనీయం. ఇది దేశ ఖ్యాతిని ఎంతో పెంచుతుంది. ఈ విజయానికి కృషి చేసిన ఇస్రో శాస్త్రవేత్తల బృందానికి నా అభినందనలు.

– నవ్యశ్రీ, 9వతరగతి, విద్యార్థిని

ప్రపంచ దేశాలు ఉత్కంఠగా..



ఇస్రో చేపట్టిన ఈ ప్రయోగంతో యావత్‌ ప్రపంచం ఎంతో ఆసక్తిగా తిలకించింది. చంద్రునిపై ల్యాండర్‌ దిగే ఉత్కంఠ క్షణాలను చూసేందుకు దేశ ప్రజలు టీవీలు, సెల్‌ఫోన్లకు అతుక్కుపోయారు. ప్రపంచ దేశాలు సైతం భారతదేశం సాధించిన గొప్ప విజయాన్ని చూసి ఆశ్చర్యపోయాయి. అంతటి గొప్ప విజయం సాధించిన ఇస్రో శాస్త్రవేత్తల బృందానికి అభినందనలు.

– పెంట జలందర్‌, టీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు

సాంకేతిక రంగంలో భారత్‌ సత్తా



భారతదేశం సాంకేతిక రంగంలో దినదినాన అభివృద్ధి చెందుతోందనడానికి చంద్రయాన్‌–3 విజయవంతమే కారణం. ప్రపంచ దేశాలు చేయని విజయవంతమైన కార్యక్రమం భారతదేశ శాస్త్రవేత్తలు విజయవంతంగా చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకున్న ఇస్రో మన సత్తాను ప్రపంచానికి తెలిపింది.

– బి. ధ్రుతి, 9వ తరగతి, కాకతీయ ఒలింపియాడ్‌ పాఠశాల, సుభాష్‌నగర్‌

ఎంతో ఉత్కంఠంగా ఎదురు చూశా



వీడియోల్లో చంద్రునిపై చంద్రయాన్‌–3 ద్వారా ల్యాండర్‌ దిగుతున్న దృశ్యాన్ని చూసి ఎంతో గర్వించా. నా భారతదేశం ఎంతో గొప్పది. ఏ దేశం చేయని సాహసోపేతమైన పని మన శాస్త్రవేత్తలు చేశారు. పట్టుదల ఉంటే అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తాం అనడానికి ఇదో గొప్ప ఉదాహరణ. శాస్త్రవేత్తల బృందానికి కృతజ్ఞతలు.

–ప్రభాకర్‌, స్థానికుడు

ఇస్రో సరికొత్త రికార్డు



చంద్రుడి దక్షిణ ధ్రువంపై ఇస్రో ల్యాండర్‌ను లాంచ్‌ చేయడం అభినందనీయం. ఈ ప్రయోగాన్ని నేను టీవీలో చూసి ఎంతో సంతోషాన్నిచ్చింది. టీవీలో చంద్రయాన్‌–3 చంద్రునిపై ల్యాండర్‌ పనితీరును చూసి ఆశ్చర్యానికి గురయ్యా.

– గీతాదేవి, 9వ తరగతి విద్యార్థిని, కాకతీయ ఒలింపియాడ్‌ పాఠశాల

ప్రపంచ దేశాలు గర్వపడేలా భారత్‌



నిజామాబాద్‌నాగారం: భారతదేశం ప్రపంచ దేశాలే గర్వపడేలా చంద్రయాన్‌–3 ద్వారా చంద్రుని పై ల్యాండ్‌ కావడం మనందరికీ గర్వకారణం. చంద్రుని దక్షిణ ధ్రువంపై ల్యాండ్‌ అయిన మొదటి దేశంగా, చంద్రునిపై సాఫ్ట్‌గా ల్యాండ్‌ అయినటువంటి దేశాల్లో అమెరికా, చైనా, రష్యా తర్వాత నాలుగో దేశంగా భారత్‌ నిలిచింది. చంద్రయాన్‌ 3 విజయవంతానికి శాస్త్రవేత్తల కృషి ఎంతో ఉంది.

– గఫూర్‌ వెంకటేశ్వర్లు, ప్రజాసైన్స్‌ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు

క్రైం కార్నర్‌

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేటకు చెందిన మత్తమాల సిద్ధిరాములు (45) మెదక్‌ జిల్లా చిన్న శంకరంపేట సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్ధిరాములు ఏడాది క్రితం బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాడని, అక్కడే కూలీ పనులు చేసుకుంటు జీవనం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల తన తల్లి అంజవ్వ అనారోగ్యానికి గురికావడంతో స్వగ్రామానికి వచ్చిన సిద్ధిరాములు బుధవారం తన టీవీఎస్‌ ఎక్సెల్‌ వాహనంపై హైదరాబాద్‌కు బయలుదేరాడు. మెదక్‌ జిల్లా చిన్నశంకరంపేట సమీపంలోని కొర్విపల్లి వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్‌ సిద్ధిరాములును ఢీకొన్నది. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సిద్ధిరాములు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య నాగరాణి, కుమారుడు, కూతురు ఉన్నారు.



రోడ్డుప్రమాదంలో మృతిచెందిన సిద్ధిరాములు

డెంగీతో యువకుడు..



సంపత్‌కుమార్‌గౌడ్‌ (ఫైల్‌)

ఎడపల్లి (బోధన్‌): మండల కేంద్రానికి చెందిన సంపత్‌కుమార్‌ గౌడ్‌ (21) డెంగీ వ్యాధితో బుధవారం మృతి చెందాడు. డెంగీకి గురైన సంపత్‌ హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడని కుటుంబీకులు తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి ..

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండలం శెట్పల్లి గ్రామానికి చెందిన వడ్ల కాశీరాం(52) మృతి చెందినట్లు ఎస్సై ప్రభాకర్‌ తెలిపారు. కాశీరాం ఉపాధి నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి 15 ఏండ్ల క్రితం హైదరాబాద్‌కు వెళ్లాడు. ఈ నెల 17న స్వగ్రామం శెట్పల్లికి వచ్చిన కాశీరాం అదే రోజు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టు పక్కలా వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం మెంగారం అటవీ ప్రాంతంలో మృతదేహం లభించినట్లు ఎస్సై తెలిపారు. కాశీరాం ఆత్మహత్య చేసుకున్నాడా, ఎవరైన హత్య చేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నిందితుడికి రిమాండ్‌

పెద్దకొడప్‌గల్‌(జుక్కల్‌): మొబైల్‌ షాప్‌లో దొంగతనం చేసిన నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై కోనా రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని మోను మొబైల్‌ షాప్‌లో దొంగతనానికి పాల్పడిన పెద్దకొడప్‌గల్‌కు చెందిన గైని సాయికుమార్‌ను సీసీఫుటేజీ ద్వారా గుర్తించి అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడు మద్యానికి బానిసై దొంగతనాలకు అలవాటుపడినట్లు చెప్పారు. కేసును త్వరగా పరిష్కరించిన పోలీసు సిబ్బంది గోరి, అంజి, రవి, రమేశ్‌ను ఎస్సై అభినందించారు.

ఆలయంలో చోరీ

పెద్దకొడప్‌గల్‌ (జుక్కల్‌): పెద్దకొడప్‌గల్‌ మండల కేంద్రంలోని పాపహరేశ్వర ఆలయంలో మంగళవారం చోరీ జరిగినట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు. ఆలయ పూజారి బుధవారం ఉదయం ఆలయం తెరిచి చూడగా హుండీని ధ్వంసం చేసి నగదును దోచుకెళ్లినట్లు చెప్పారు. ఆలయంలోని సీసీ ఫుటేజీని పరిశీలించగా మధ్యాహ్నం చోరీకి గురైనట్లు గుర్తించారు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వార్డుబాయ్‌పై కేసు నమోదు



ఖలీల్‌వాడి: నగరంలోని మనోరమ ఆస్పత్రిలో వార్డు బాయ్‌గా పని చేస్తున్న ఆకుల సత్యనారాయణపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. గుండె వ్యాధితో మనోరమ ఆస్పత్రిలో అడ్మిట్‌ అయిన మోహన్‌ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో మోహన్‌ జేబులో నుంచి పర్సుతో పాటు ఏటీఎం కార్డును వార్డు బాయ్‌ సత్యనారాయణ దొంగించాడు. విషయాన్ని గమనించిన మోహన్‌ కుమారుడు దీపక్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు సత్యనారాయణ దొంగిలించిన ఏటీఎం కార్డుల నుంచి రూ.59 వేల నగదు తీసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

బీజేపీ నాయకులపై కానిస్టేబుల్‌ ఫిర్యాదు

బాన్సువాడ: బాన్సువాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్‌ మంగీలాల్‌ను నెట్టేసి ఆందోళన చేసిన బీజేపీ నాయకులపై మంగీలాల్‌ ఫిర్యాదు చేసినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. బీజేపీ నాయకులు మల్యాద్రి రెడ్డి, కొత్తకొండ భాస్కర్‌, లక్ష్మీనారాయణ, గుడుగుట్ల శ్రీనివాస్‌, కోనాల గంగారెడ్డి, భూపాల్‌రెడ్డి, చిదుర సాయిలు, వడ్ల శేఖర్‌, గంగారాం, హన్మాండ్లు, స్వామిగౌడ్‌, శంకర్‌, హరికృష్ణ, వినాయక్‌రెడ్డి, ప్రకాశ్‌పటేల్‌, శంకర్‌రెడ్డి, అఖిలాశ్‌రెడ్డి, గోవర్ధన్‌పై ఫిర్యాదు చేశారని చెప్పారు. విచారణ చేసి కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు.

బోధన్‌ రైల్వే స్టేషన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి



రాకాసీపేట్‌ రైల్వే స్టేషన్‌లో డీఆర్‌ఎం లోకేష్‌ వైష్ణోయ్‌కి సమస్యలు వివరిస్తున్న నాయకులు



బోధన్‌లోని రాకాసీపేట్‌ రైల్వేస్టేషన్‌లో పర్యటిస్తున్న డీఆర్‌ఎం

బోధన్‌టౌన్‌(బోధన్‌): బోధన్‌ పట్టణంలోని రాకాసీపేట్‌ రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని హైదరాబాద్‌ డివిజన్‌ రైల్వే మేనేజర్‌ లోకేష్‌ వైష్ణోయ్‌ పేర్కొన్నారు. రైల్వే స్టేషన్‌ను బుధవారం డీఆర్‌ఎం పరిశీలించారు. టికెట్‌ కౌంటర్‌, రైల్వే ప్లాట్‌ఫాంను పరిశీలించి, మాట్లాడారు. బోధన్‌ రైల్వేస్టేషన్‌ను జనరల్‌ విజిట్‌ చేశామని, ఇక్కడి సమస్యలను గురించి స్టేషన్‌ మాస్టర్‌తో పాటు రైల్వే అధికారులను అడిగి తెలుసుకున్నారు. నివేధికను ఉన్నతాధికారులకు అందజేస్తామని వెల్లడించారు. అనంతరం బోధన్‌– మిర్జాపల్లి ప్యాసింజర్‌ రైలును పునరుద్ధరించాలని విద్యార్థి జేఏసీ నాయకులు శివాకుమార్‌, విద్యార్థి జేఏసీ నాయకులు డీఆర్‌ఎంకు వినతి పత్రం అందజేశారు. రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ను, నిజామాబాద్‌–కరీంనగర్‌ డెమో రైలును బోధన్‌ నుంచి ప్రారంభించి, టికెట్లు అందజేయాలన్నారు. బోధన్‌– బీదర్‌ రైల్వే పనులను తక్షణమే ప్రారంభించాలన్నారు. సమస్యలపై డీఆర్‌ఎం సానుకూలంగా స్పందించి, సెప్టెంబర్‌ 1నుంచి రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ టికెట్లు అందించాలని స్టేషన్‌ మేనేజర్‌ను ఆదేశించారు. విద్యార్థి జేఏసీ నాయకులు మోసిన్‌, నాగరాజు, సచిన్‌ పటేల్‌, సంజు, జునైద్‌, రాజేందర్‌, బదు, సుభాష్‌, సాయికుమార్‌లు ఉన్నారు.

రోగులకు వైద్యసేవలు అందించాలి

డీఎంహెచ్‌వో సుదర్శనం

సిరికొండ: పీహెచ్‌సీకి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యశాఖ అధికారి సుదర్శనం వైద్యాధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సీజనల్‌ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. సూపర్‌వైజర్లు తమ పరిధిలోని గ్రామాల్లో నిరంతరం పర్యటించాలన్నారు. 14 రోజుల పాటు లెప్రసీ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వే కోసం ఇంటికి వచ్చిన సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కంటివెలుగులో భాగంగా జిల్లాలో రీడింగ్‌ అద్దాలు 88135, ప్రిస్క్రిప్షన్‌ అద్దాలు 82894 మందికి పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట మెడికల్‌ ఆఫీసర్‌ అరవింద్‌, సీహెచ్‌వో అనంత్‌రావు, అధికారులు, సిబ్బంది ఉన్నారు.



సిబ్బందికి ఆదేశాలిస్తున్న డీఎంహెచ్‌వో సుదర్శనం

లోక్‌ అదాలత్‌లో కేసులను పరిష్కరించాలి

ఖలీల్‌వాడి: జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీ అయ్యే కేసులను పరిష్కరించాలని మొదటి అదనపు జిల్లా జడ్జి కనకదుర్గ అన్నారు. నగరంలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశానికి జడ్జి హాజరై మాట్లాడారు. సెప్టెంబర్‌ 9న నిర్వహించే లోక్‌అదాలత్‌లో జిల్లాలో అత్యధికంగా కేసులను పరిష్కారించాలని సూచించారు. పోలీసులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్‌ సివిల్‌ జడ్జి పద్మావతి, జడ్జి కుష్బూ ఉపాధ్యాయ, పీపీ రహీమొద్దీన్‌, ఏసీపీ కిరణ్‌కుమార్‌, సీసీఆర్‌బీ రవీందర్‌ రెడ్డి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న జడ్జి కనకదుర్గ

భారత జట్టు క్రీడాకారులకు ఘన సన్మానం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): చైనా దేశంలోని ఫిజియన్‌ ప్రావిన్స్‌, ఫింగ్‌టన్‌ సిటీలో ఈనెల 29 నుంచి సెప్టెంబర్‌ 2 వరకు నిర్వహించే జూనియర్‌ సాఫ్ట్‌బాల్‌ (అండర్‌–18) ఏషియన్‌ చాంపియన్‌షిప్‌ పోటీలు జరుగనున్నాయి. పోటీల్లో భారతజట్టు సభ్యులుగా నిజామాబాద్‌ జిల్లాకు చెందిన క్రీడాకారిణులు లకావత్‌రాణి (సాంఘిక సంక్షేమ కళాశాల, సుద్దపల్లి), అజ్మీర ఇందు (సాంఘిక సంక్షేమ బాలికల డిగ్రీ కళాశాల, ఆర్మూర్‌) ఎంపికయ్యారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్‌ నవీన్‌ నికొలస్‌ హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో క్రీడాకారిణులను ఘనంగా సన్మానించారు. గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడం అభినందనీయమని అన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ విద్యాసంస్థల స్పోర్ట్స్‌ ఆఫీసర్‌ రామలక్ష్మయ్య, రాష్ట్ర స్పోర్ట్స్‌ నోడల్‌ ఆఫీసర్‌ శేషుకుమారి, ఆర్మూర్‌ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ ధనవేని, గోదావరి, స్వప్న, వేముల మౌనిక పాల్గొన్నారు.



క్రీడాకారిణులను సన్మానిస్తున్న డాక్టర్‌ నవీన్‌

బోధన్‌లో విద్యార్థుల రాస్తారోకో



బోధన్‌: సాలూర మండల కేంద్రం నుంచి పట్టణ కేంద్రానికి బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్‌ చేస్తూ భారతీయ విద్యార్థి సేన ఆధ్వర్యంలో విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి బుధవారం నిరసన తెలిపారు. గతంలో బస్సు సౌకర్యం కల్పించాలని డిపో మేనేజర్‌ శ్రీనివాస్‌ను కలిసి విన్నవించినా పరిష్కరించలేదన్నారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు డిపో అధికారులు, రూరల్‌ ఎస్సై నాగ్‌నాథ్‌ ఘటన స్థలానికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు.

yID +కు చేరిన విచారణ నివేదిక

నిజామాబాద్‌అర్బన్‌: నగరంలోని బీబీసీ పాఠశాలకు సంబంధించిన విచారణ నివేదిక బుధవారం జిల్లా విద్యాధికారికి చేరింది. దారుగల్లి హెడ్‌మాస్టర్‌ శంకర్‌ బీబీసీ పాఠశాల చైర్మన్‌ ప్రవీణ్‌ విద్యార్థినిని బయటకు తీసుకెళ్లిన ఘటనపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టారు. విద్యార్థినిని కూడా ప్రశ్నించారు. విచారణ నివేదికను విద్యాధికారికి అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా (ఎస్‌బీఐ) గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కోసం అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ డైరెక్టర్‌ శ్రీనివాస్‌ తెలిపారు. ఏసీ రిపేరింగ్‌ (30 రోజులు), టూ వీలర్‌ మెకానిక్‌ (30 రోజులు), సీసీటీవీ రిపేరింగ్‌ (13 రోజులు) కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఉచిత శిక్షణతో పాటు ఉచిత భోజన సదుపాయం, హాస్టల్‌ వసతి కల్పిస్తారని తెలిపారు. నిజామాబాద్‌, కామారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత యువకులు, 19 నుంచి 40 సంవత్సరాల వయసు కలిగి ఉన్న వారు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ వెంట ఆధార్‌ కార్డ్‌, రేషన్‌ కార్డ్‌, పదో తరగతి ధ్రువీకరణ పత్రం, ఐదు ఫొటోలతో వచ్చి డిచ్‌పల్లిలోని ఎస్‌బీఐ ఆర్‌ఎస్‌ఈటీఐ శిక్షణ కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 08461–295428 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: ధైర్య సాహసాలను ప్రదర్శించి ఆపదలో ఉన్న బాల బాలికలను రక్షించిన బాలలు ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్‌ పురస్కార్‌–2023కు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ, మహిళా శిశువు దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ అధికారి రసూల్‌ బీ తెలిపారు. నూతన ఆవిష్కరణలు, ఆటలు, సాహిత్యం, సామాజిక సేవ, ధైర్య సాహస కార్యక్రమాలు, పలు అంశాలకు ఈ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. అవార్డులకు 18 ఏండ్ల లోపు ఉన్న బాల బాలికలు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు https:// awards. gov. inలో వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

అత్యాచారం కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

కామారెడ్డి క్రైం: మహిళ హత్య కేసులో ఇద్దరు నిందితులకు జడ్జి టి.శ్రీనివాస్‌ జీవిత ఖైదు శిక్షతో పాటు రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. 2019 జూన్‌ 2న కామారెడ్డిలోని సిరిసిల్ల రోడ్డు ప్రాంతానికి చెందిన శివాజీ పవర్‌, ఆస్తుల అశోక్‌ తమ ఇంటికి దగ్గరలో ఉన్న లక్ష్మి (35) అనే మహిళను అత్యాచారం చేసి హత్య చేసినట్లు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని బాధితురాలిని ఆస్పత్రిలో చేర్పించారు. అదే రోజు లక్ష్మి చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు అత్యాచారం, హత్య కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు పంపారు. నాటి నుంచి కేసు నిజామాబాద్‌ ఎస్సీ, ఎస్టీ స్పెషల్‌ కోర్టు పరిశీలనలో ఉంది. కేసును పరిశీలించిన జడ్జి శ్రీనివాస్‌ నేరం రుజువు కావడంతో నిందితులను జీవిత ఖైదు శిక్షతో పాటు రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించారు. కేసు పరిశోధన చేసిన అప్పటి సీఐ జి.రామకృష్ణ, డీఎస్పీ లక్ష్మీనారాయణ, ప్రస్తుత సీఐ నరేశ్‌, పీపీ కవితారెడ్డి, కోర్టు కానిస్టేబుల్‌ సంతోష్‌, లైసనింగ్‌ అధికారులు విఠల్‌, హన్మాండ్లును ఎస్పీ శ్రీనివాసరెడ్డి అభినందించారు.